# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు చెన్నైలో పర్యటించనున్నారు.
- ❖ భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత సాయుధ బలగాలు సామర్థ్యాలు, వ్యూహాత్మక విధానాలలో సమూల మార్పులు చేసుకుంటున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- ❖ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలు అనివార్యమని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ రాగల రెండు రోజుల పాటు కేరళం, మాహే, లక్షద్వీప్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు చెన్నైలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పూనమల్లి నుంచి వడపళని వరకు నిర్మించిన 14.5 కిలోమీటర్ల మెట్రో రైలు సేవలను ఆయన ప్రారంభించి.. జాతికి అంకితం చేయనున్నారు. అలాగే.. దృశ్య మాధ్యమం ద్వారా 5 అమృత్ భారత్ స్టేషన్లను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం ఐఐటీ మద్రాస్‌లోని బ్రెయిన్ సెంటర్‌ను పరిశీలించడంతో పాటు, చెన్నై కన్వెన్షన్ సెంటర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

========================

ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు అత్యవసరమని, ప్రపంచ నిర్ణయాల ప్రక్రియలో భారత్, ఆఫ్రికా ఖండానికి ఇప్పటికీ తగిన ప్రాతినిధ్యం లేకుండా ఉండడం సమంజసం కాదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వ్యాఖ్యానించారు. మూడు దేశాల ఆఫ్రికా పర్యటనలో చివరిగా ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాలోని అడ్వా విక్టరీ మెమోరియల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొని మాట్లాడారు. 2023లో భారత్ అధ్యక్షతన జరిగిన జీ-20 సదస్సులో ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించేందుకు భారత్ తీసుకున్న చొరవను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భద్రతా మండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యత్వాలు రెండింటిలోనూ ఆఫ్రికా దేశాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని జైశంకర్ సూచిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

అదే విధంగా ఆఫ్రికా దేశాలతో భారత్ సంబంధాలు మరింత బలపడుతున్నాయని జైశంకర్ తెలిపారు. ప్రస్తుతం ఆఫ్రికాకు భారత్ నాల్గో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉందని, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరువవుతోందని వెల్లడించారు. అలాగే భారత్ మద్దతుతో ఆఫ్రికా వ్యాప్తంగా 4.5 బిలియన్ డాలర్ల విలువైన 220కుపైగా అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తయ్యాయని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధునిక యుద్ధ విధానాలతో పాటు ప్రపంచ భద్రతా వ్యవస్థలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో.. పొరుగు దేశాలు సహా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. వాటి వ్యూహాత్మక ప్రభావాలను కూడా నిరంతరం అంచనా వేస్తున్నామని చెప్పారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వాయుసేన స్థావరంలో ఈరోజు నిర్వహించిన 'తరంగ్ శక్తి-2026' విన్యాసాలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు భారత సాయుధ దళాలు నిర్మాణం, సామర్థ్యాలు, వ్యూహాత్మక దృక్పథం పరంగా సమూల మార్పులు చేసుకుంటున్నాయని తెలిపారు. కీలక రక్షణ సాంకేతికతలను దేశీయంగా రూపకల్పన చేయడం, అభివృద్ధి చేయడం, తయారీ, నిర్వహణ, ఆధునీకరణ సామర్థ్యాలను పెంపొందించుకోవడమే ఆత్మనిర్భర్ భారత్ ప్రధాన ఉద్దేశమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అందరికీ సులభంగా, తక్కువ ఖర్చుతో కూడిన మానసిక ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా పునరుద్ఘాటించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సేవలు మరింత మందికి విస్తరిస్తున్నాయని వెల్లడించారు. మొత్తం 53 టెలి-మానస్ (Tele-MANAS) కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని, ఇప్పటివరకు ఈ హెల్ప్‌లైన్‌కు 48 లక్షలకు పైగా కాల్స్ వచ్చాయని తెలిపారు. మానసిక సమస్యలపై సమాజంలో ఉన్న అపోహలు, కళంకాన్ని (Stigma) తొలగించేందుకు ఇది కృషి చేస్తోంద కేంద్రమంత్రి పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత నెలలో ఫ్లైదుబాయ్ (flydubai) విమానం గాల్లో ఉండగా కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై జరిగిన దాడి ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) కేసు నమోదు చేసింది. యాంటీ-హైజాకింగ్ చట్టం-2016, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA)-1967లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. గుజరాత్‌కు చెందిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ గతనెల 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానానికి పైలట్‌గా వ్యవహరించారు. విమానం గాల్లో ఉండగా కాక్‌పిట్ లోపల ఉన్న కోపైలట్ ఆయనపై దాడికి పాల్పడటంతో కెప్టెన్ తీవ్రంగా

గాయపడ్డారు. తీవ్ర గాయాలపాలైనప్పటికీ, స్మిత్ మచ్చార్ ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. తాజాగా ఈ దాడి వెనుక ఉన్న కుట్ర కోణాలను వెలికితీసేందుకు ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి వేదికను దుర్వినియోగం చేస్తూ.. జమ్మూకశ్మీర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి సమాధానం ఇచ్చింది. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమేనని, అది శాశ్వతంగా భారతదేశంలోనే కొనసాగుతుందని స్పష్టం చేసింది. న్యూయార్క్‌లో జరిగిన యూఎన్ జనరల్ అసెంబ్లీ నాల్గవ కమిటీ సమావేశంలో వలసవాద నిర్మూలన అంశంపై చర్చ సందర్భంగా భారత్ 'రైట్ ఆఫ్ రిప్లై'ను వినియోగించింది. పాకిస్థాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలకు స్పందించిన ఎంపీ మహిమా కుమారి మేవార్.. జమ్మూకశ్మీర్ విషయంలో తప్పుడు ఆరోపణలు చేయడానికి పాక్ ఐక్యరాజ్యసమితి వేదికను ఉపయోగిస్తోందని విమర్శించారు. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లో హక్కులు, కనీస అవసరాల కోసం ఆందోళన చేసిన పౌరులను పాకిస్థాన్ బలగాలు, వాటి మద్దతుదారులు హతమార్చారని ఆరోపించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విపక్ష కూటమి రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచేందుకు, ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు. భోపాల్‌లో ఈరోజు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో `వికసిత్ భారత్` నిర్మాణానికి ఓవైపు దేశ ప్రజలందరూ అండగా వుంటే, మరోవైపు ప్రతిపక్షాలు తీవ్ర నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయాయని చెప్పారు. స్వదేశీ పారిశ్రామికవేత్తలు పురోగతి సాధించడాన్ని విపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెప్పారు. బెంగాల్, అసోం, పుదుచ్చేరిలలో బీజేపీ-ఎన్డీయే సాధించిన విజయాలు కేవలం రాజకీయ గెలుపు మాత్రమే కాదని, నరేంద్ర మోదీ నాయకత్వంపై, దేశ అభివృద్ధిపై ప్రజలకు ఉన్న అపరిమితమైన నమ్మకానికి నిదర్శనమని శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఎనిమిది వారాలుగా కొనసాగిన నష్టాల పరంపరకు ముగింపు పలికాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూలతలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం కారణంగా ముడిచమురు ధరలు అధిక స్థాయిలో ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్లు పుంజుకోవడం విశేషం. ఈ వారం, బీఎస్ఈ సెన్సెక్స్ 563 పాయింట్లు లాభపడి 72 వేల 472 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ-50 సూచీ 99 పాయింట్లు పెరిగి 22 వేల 520 స్థాయికి చేరింది. ఎన్ఎస్ఈ మిడ్‌క్యాప్-100 సూచీ స్వల్పంగా లాభపడగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీ వారంలో అరశాతం మేర పెరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాగల రెండు రోజుల పాటు కేరళం, మాహే, లక్షద్వీప్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, ఒడిశా, పశ్చిమ రాజస్థాన్‌లలో కూడా రాగల రెండు రోజుల్లో ఇదే విధమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించింది. మరోవైపు, కోస్తా కర్ణాటక, కొంకణ్, గోవా ప్రాంతాల్లో రేపు అక్కడక్కడ తీవ్రమైన వేడి, ఉక్కబోత వాతావరణం ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (CJP) నిరసనల నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఢిల్లీ పోలీసు డిప్యూటీ కమిషనర్ (డీసీపీ) కుమార్ అభిషేక్ పాత్రికేయులకు తెలిపారు. న్యూఢిల్లీ ప్రాంతంలో ముందస్తు తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. నేటి నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రణాళిక రచించిన కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు

డీసీపీ వెల్లడించారు. మరోవైపు, న్యూఢిల్లీ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునేలా సహాయం అందిస్తున్నామని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసు డిప్యూటీ కమిషనర్ వికాశ్ కుమార్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =